# దయ్యాల కొంప

-వి. హేమ

**అం**త పెద్ద ఊరు! అన్నిళ్లున్నాయన్న మాటేగాని, నేను నా ఫామిలీ సుఖంగాఉండేందుకు చాలిన రెండు గదుల వాటా దొరకడమే ఎంతో కష్టమైపోయింది. ట్రాన్సఫర్ మీద నేనీ ఊరొచ్చి పదిరోజులు దాటింది. నేను రెండు మూడు ఇళ్లు చూసి వచ్చా. కాని ఒక్కటీ నచ్చలేదు.

ఒకటి– చాలా చిన్న ఇల్లు. వంటగదిలో మా ఆవిడ కదిలేందుకు చాలిన జాగా కూడా లేదనిపించింది. ఇక రెండో ఇల్లు– మా పిల్లల్ని చేర్పించాల్సిన స్కూలుకి అది చాలా దూరంలో ఉంది. ఎండల్లో, వానల్లో పిల్లలు మానకుండా బడికి వెళ్లాలంటే ఇల్లు "బడికి కాస్త దగ్గరలో ఉండాలి" అంది మా ఆవిడ. హతోస్మి!

ఇంక మూడో ఇంటి విషయం!– ఎందుకులెండి. ఇలాగే ఏవేవో నచ్చని విషయాలుండబట్టే ఏ ఒక్క యిల్లూ కుదరలేదు నేను ఎంత ప్రయత్నం చేసినా. హైస్కూల్‌లో చదువుతున్న మా పిల్లల్ని స్కూల్లో త్వరగా చేర్పించకపోతే, వాళ్లు కొత్త చోటుకి అలవాటు పడేలోగా చాలా పాఠాలు చెప్పడం అయిపోతే చదువులో పిల్లలు వెనకబడి పోతారంటూ నా శ్రీమతి కాల్ చేసి సతాయించడం మొదలుపెట్టింది. పిల్లలకి వేసవి సెలవులు అయ్యేలోగా ఇల్లు వెతికి పట్టాలని నా శక్తివంచన లేకుండా శ్రమపడుతూనే ఉన్నా.

నా ప్రక్క సీటు కొలీగ్ చలపతి నాతో కలుపుగోలుగా మాట్లాడుతూంటాడు. ఒక రోజు వీలు చూసుకుని నా గోడు ఆయనతో మొరపెట్టుకున్నా.

"చంద్రంగారూ! మీరింత ఇదిగా అడిగారు కనుక చెపుతున్నా. హైస్కూలుకి ఓ వంద గజాల ఇవతల మా వాళ్లదే ఒక ఇండిపెండెంట్ హవుస్ ఉంది. అద్దె కూడా మరీ ఎక్కువేం కాదు. మీరు 'సరే' అంటే ఈ రోజు సాయంకాలమే వెళ్లి చూసి వద్దాం" అన్నాడు చలపతి.

అద్దె కొంప కోసం వెతికి వెతికి అలసి ఉన్న నా మనసు ఒక్కసారిగా ఎగిరి గంతేసింది. ఆ సాయంకాలం వెళ్లి ఇల్లు చూద్దామని చెప్పేశా.

ఆఫీసు వదిలిపెట్టగానే ఇద్దరం కలిసి చలపతి బైక్ మీద ఆ ఇల్లు చూడడానికి బయలుదేరాం మంచి శకునం చూసుకుని.

చాలా పెద్ద ఆవరణలో (వెయ్యి చదరపు గజాలైనా ఉంటుంది ఆ స్థలం అనిపించింది నాకు) ఉంది ఆ ఇల్లు! చూసేవాళ్లూ, చేసేవాళ్లూ లేక కాబోలు అడవిలా పెరిగిపోయి ఉన్నాయి ఇంటి చుట్టూ రకరకాల చెట్లు. ఇల్లు మాత్రం మంచి కండిషన్‌లోనే ఉంది.

తన దగ్గరున్న తాళంతో ఇంటి తలుపు తెరిచాడు చలపతి. ఎందుకైనా మంచిదని ముందుగా కుడికాలు ముందుంచి గడపదాటా. ఎన్నో రోజుల నుండి వాడకంలో లేదు కాబోలు, ఇల్లంతా బూజులతో నిండి ఉండి, గవులు కంపు కొడుతోంది.

అది మూడు గదులున్న డాబా యిల్లు. అన్ని

## కొన్ని హైకూలు

**ఇ**సుక తిన్నెల్లోంచి చూసా
నీ కన్నులు దూరాన్నుంచి నిదానించి
నన్ను ఎక్స్‌రే తీసాయి.

రెప్పపాట్న కంటి రెటీనాపై
నీ చిత్రపటం స్టిల్ ఫోటోగ్రాఫ్‌లా
నిక్షిప్తమయ్యింది.

నీ కన్నుల లోగిల్లో
కాంతులున్నాయి, కలువలున్నాయి
నన్ను వెలిగించేందుకు.

నీ కంటిపాపలోని
నీలి సముద్రం మునుగదీసుకొంది
నన్ను రారమ్మని చెప్పి.

కాలం ఫోటో తీసాను
ప్రతి ఫ్రేమ్‌లోను కూడా నువ్వే
దృశ్యకావ్యం రాయాలి ఇక.

నిశ్శబ్ధం అంతటన
టిక్... టిక్... టిక్... టిక్... టిక్ శబ్దం తప్ప
అందులోను నీ పేరే ఉంది.

నవ వసంతం మళ్ళీ వచ్చినది
నువ్వు వస్తానని చూసా కాని రాలేదు
ఇక నవ వసంతమెక్కడిది.

-సబ్బని లక్ష్మీనారాయణ

వసతులూ చక్కగా అమరి ఉన్నాయి. హాలు గదులు చాలా విశాలంగా పెద్ద పెద్ద గ్రిల్లుడ్ కిటికీలతో ఉన్నాయి. గాలికీ వెలుగుకీ లోటు లేదు. అకస్మాత్తుగా నాలో ఒక కుశ్శంక- ఇంత మంచి ఇల్లు ఇలా ఉండి పోయింది ఎందుకనో- అంటూ. కాని వెంటనే మనసు సరిపెట్టేసుకున్నా- ఇది నా కోసమే ఎదురు చూస్తూ ఇలా ఉండిపోయి ఉంటుంది- అని. ఇంతకీ అద్దె ఎంత ఉంటుందో!

నా భావం గ్రహించిన వాడిలా చలపతి, "ఈ ఊళ్లో అపార్టుమెంట్లలో రెండు గదుల వాటాలకే బోలెడు అద్దె అడుగుతున్నారు. ఆపై మెయింటెనెన్సనీ, నీళ్లు కొనాలనీ ఎక్స్ట్రాలూ తప్పవు. దీనికి నేనేం ఎక్కువ చెప్పను, ఒక్క ఆరువేల ఐదు వందలు ఇవ్వండి చాలు. ఈ ఇల్లు ఆపాటి చేయకపోదు. ఏమంటారు" అంటూ నన్నే ఎదురడిగాడు.

అవతల వసతులు తక్కువైనా రెండు గదుల వాటాకే ఆ పాటి అద్దె అడిగారు! చలపతి మాటలకు నా మనసు ఉబ్బి తబ్బిబ్బయి పోయింది. "జాక్‌పాట్" కొట్టేసినంత సంబరంగా అనిపించింది నాకు. వెంటనే ఒప్పేసుకున్నా.

అపార్టుమెంట్సులో కాపురాలు మొదలయ్యాక చాలామంది పిల్లలకు ఆడుకునేందుకు జాగా ఉండక, కాలక్షేపం కోపం వాళ్లు టి.వి.లకు అతుక్కుపోవడం జరుగుతోంది. ఆ ఇంటి చుట్టూ ఉన్న దొడ్డిని చూస్తూంటే నాకు కడుపు నిండిపోయింది ఆనందంతో. వెంటనే ఆ ఇంటికి ఓ.కె. చెప్పేశా.

"ఈ ఇల్లు మీకే ఖాయం" అంటూ నేనిచ్చిన వెయ్యి రూపాయల అడ్వాన్సు అందుకుని జేబులో పెట్టుకున్నాడు చలపతి సంతోషంగా.

ఇద్దరం వెనక్కి తిరిగాం. ఇంటికి తాళం వేస్తూ చలపతి చెప్పాడు- "రేపే ఇల్లు శుభ్రం చేయించి, తాళం చెవులు మీకు ఇచ్చేస్తా. మీ ఇష్టం వచ్చిన రోజున ఇంట్లో ప్రవేశించండి. దొడ్డి సంగతంటారా, మీరొచ్చాక చూద్దాం."

నాకా నిర్ణయం బాగా నచ్చింది. దొడ్లో ఏ మొక్క ఉంచాలో, ఏది కొట్టేయాలో మా ఆవిడ చూసుకుంటుంది- అనుకున్నా. ఆ రోజు నేను "క్లవుడ్ నైన్" మీద తేలుతూ తాత్కాలికంగా బసచేసిన వసతి గృహానికి వెళ్లాను. ఆ రాత్రే "మాంచి ఇల్లు దొరికిం"దని మా ఆవిడకి చెప్పేశా.

○ ○ ○

ఆ మరునాడే అన్నమాట ప్రకారం ఇంటిని బాగా దులిపించి, కడిగించి శుభ్రం చేయించేశాడు చలపతి. ఆ సాయం కాలమే నా బసకి వచ్చి తాళం-చెవులు నా చేతిలో ఉంచాడు "బెస్టాఫ్ లక్" అని దీవించినట్లు అంటూ. నేనూ వెంటనే చెక్కు వ్రాసి అతని చేతుల్లో ఉంచి నా కంటె అతడే పెద్దవాడు కావడంతో కృతజ్ఞతతో నమస్కరించా.

లంచవర్లో, తాళాలు నా చేతికి వచ్చేశాయి కనుక ధైర్యంగా అనౌన్సు చేసేశా- "నాకు ఇల్లు దొరికింది" అంటూ అందరికీ. వెంటనే "ఎక్కడ", "అద్దెంత" వగైరా సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సొచ్చింది. ఓపిగ్గా చెప్పుకొచ్చా. అంతేకాదు "చలపతి పుణ్యమా- అని ఆ ఇల్లు నాకు దొరికింది" అని కూడా అనేశా. చలపతి మీద ఉన్న కృతజ్ఞతా భావంతో.

అంతే! అందరూ నోళ్ళు రవంత తెరుచుకు నిర్ఘాంతపోయారు. "ఆ ఇల్లా బాబూ!" అంటూ ఏకగ్రీవంగా కోరస్‌లా అనేసి ఠక్కున నోళ్లు మూసేసుకుని ముఖ

## ఆశ

**అం**తంటూ లేనిది ఆశ
అది ఓ ఖాళీ సంచిలాంటిది...
ఇంకా ఇంకా
నింప మంటూనే ఉంటుంది!
మన శరీరంలో
ఒక్కో భాగం కృశించినా...
నశ్వరం కానిది ఆశ!
అది నిత్య యవ్వనంతో
ఉరకలు వేస్తూ...
మనల్ని కవ్విస్తుంది!
మహా వృక్షం వ్రేళ్లు
భూమిలో గట్టిగా పాదుకున్నట్లు...
ఆశ కూడా మనిషిలో
సూక్ష్మస్థాయి వరకు వ్యాపించి...
అధః పాతాళానికి నెట్టుతుంది!
కనుక...
ప్రశాంతతకై
ఆశ అనే సంకెళ్ళ నుండి
విముక్తి పొందడమే...
అసలైన వివేకం!

-దాస్యం సేనాధిపతి

ముఖాలు చూసుకోడం మొదలెట్టారు.

నాకు ఆశ్చర్యంగా తోచింది వాళ్ల ప్రవర్తన. "ఎందుకు, ఏమిటిలాగయిపోయారు? ఆ ఇంటికేమయ్యింది" అంటూ ఆదుర్దాగా అడిగా.

"అది ఒక "హాంటెడ్ హవుస్!" చాలా రోజుల్నుండి- రోజులేమిటి, సంవత్సరాల నుండి దాంట్లో ఎవరూ ఉండటం లేదు భయంతో. అందుకే చలపతి దాన్ని చీప్‌గా నీకు అంటకట్టాడు" అన్నాడు సంతోష్ నా కొలీగ్.

ఆ మాటతో నా సంతోషం మీద నీళ్లు చల్లినట్లు అయింది. కాని నేను బయటపడి లోకువ కాదల్చుకోలేదు. తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో "ఏమా కథ" అని బింకంగా అడిగా.

మా కొలీగ్సు అందరిలోకీ పెద్దవాడైన బలరామయ్య గారు చెప్పడం మొదలు పెట్టారు. "ఈ రోజుల్లో ఈ కథల్ని చాలామంది కొట్టిపారేస్తారనుకో- కాని, అప్పుడప్పుడు జనాలకి దృష్టాంతాలు కనిపిస్తూనే ఉంటాయి. ఆ ఇంటి ఆవరణలో పగలు రాత్రి ఒక లంబాడీ దయ్యం తిరుగుతూంటుందనీ, అటువైపుగా వెళ్లిన వాళ్లకి గజ్జల చప్పుళ్లు వినిపిస్తాయనీ చెపుతారు.

ఆ ఇల్లు మన చలపతి మేనమామ కట్టించుకున్నాడు. ఆయనకి ఊళ్లో మరో ఇల్లు కూడా ఉంది. ఆ ఇంట్లో తాను కాపురముంటో, ఈ ఇల్లు అద్దె బాగా ఇస్తానన్నాడని ఒక సర్దార్‌కి అద్దెకిచ్చాడాయన. ఆ అద్దెకి దిగినవాడు ఒఠి దగుల్బాజీ కావడంతో ఈ ఇల్లు ఆసరాగా వాడు చెయ్యని అకృత్యం లేదు. ఒకసారి ఇంట్లో దిగాక వాణ్ణి ఖాళీ చేయించడం చలపతి మామయ్య వల్ల కాలేదు. వాడి రౌడీయిజంకు భయపడి ఊరుకున్నాడు. గానా బజానాలతో ఇల్లు మారుమ్రోగిపోతూండేది.

ఒకసారి ఆ సర్దారు ఒక లంబాడీ పిల్లని చెరబట్టాడు. అటువైపు కుతూహలంతో తొంగిచూసిన వాళ్లకి, కళ్ల నీళ్లలో కరుగుతున్న ఆ పిల్ల ముఖం దీనంగా, కిటికీలోంచి కనిపించేదిట. ఒకరోజు ఆ పిల్ల ఎలాగో తప్పించుకొని బయటికి వచ్చి, ఆవరణలో ఉన్న నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందిట! పాపం!!

ఆ పని పట్టపగలు జరిగిందేమో, గోడకి ఆవల, చింతచెట్టు ఎక్కి చింత చిగురు కోసుకుంటున్న పిల్లలు చూశారా దృశ్యం. వాళ్లు వెళ్లి ఊళ్లో నలుగురికీ చెప్పడం, ఊళ్లో వాళ్లు పోలీసులకి చెప్పడం, అంతా కలిసి ఆ నూతి దగ్గర చేరి ఆ అమ్మాయిని బయటికి లాగడం జరిగేటప్పటికి చాలా టైం గడిచిపోవడం ఆ లంబాడీ అమ్మాయి చచ్చిపోయిందిట. ఆ సమయంలో సర్దార్జీ అతని అనుచరులు ఆ ఇంట్లో లేరు గాని, పోలీసులు నిఘా వేసి వాళ్లని పట్టుకుని శిక్షించగలిగారు. అలా ఖాళీ అయ్యింది ఆ ఇల్లు.. అప్పట్నుండీ ఆ లంబాడీ అమ్మాయి చచ్చి దయ్యమై ఆ ఇంట్లో తిరుగుతోంది అని చెప్పుకుంటారు.

"దయ్యాల కొంప" అని పేరు రావడంతో ఆ ఇంటిని ఎవరూ కొనడానికి గాని, అందులో ఉండడానికి గాని ముందుకి రాకపోవడంతో అది అలా ఖాళీగా ఉండిపోయింది. చలపతి మేనమామ పోయారు. ఆయన కొడుకులు ఈ ఊళ్లోని ఆస్తులు అమ్మేసుకుని ఉద్యోగపు ఊళ్లలో స్థిరపడిపోయారు. కాని, ఈ ఇల్లు ఎవరూ కొనక ఇలా ఉండిపోయింది. దీని తాళాలు చలపతి దగ్గర ఉంచారు. ఇల్లు శిథిలం కాకుండా, ఏడాదికి ఒకటి రెండుసార్లు దానిని శుభ్రం చేయిస్తూండమని. ఇదీ ఆ ఇంటి కథ!

ఈ రోజుల్లో ఇటువంటివన్నీ నమ్మరనుకో అంటూ ముగించారు ఆయన.

ఎంత మోసం! ఎంత దగా! చలపతి నాకు ఎంత టోకరా ఇచ్చాడు! ఆ క్షణంలో కనిపిస్తే అతన్ని పీక పిసికి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు. కాని, ఆ రోజు జ్వరంగా ఉందంటూ సెలవు చీటీ పంపించి తప్పించుకున్నాడు.

లంచ్ టైం పూర్తికావడంతో సీట్ల దగ్గరకు వెడుతూ, నా కొలీగ్సు నా వైపు చూసిన చూపుల్లోని సానుభూతికి, వాళ్ల ముఖాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్న భయానికి క్రమంగా నా మనసు వీగిపోయింది. "నాకిలాంటి

## మత్తు

**తా**గిన వాడి మత్తు
వదులుతుంది కొద్ది గంటల్లో
ఉద్యోగి అధికార మత్తు
వదలదు పదవీ విరమణ దాకా

## పనికిమాలినవాడు

**దో**చుకొని తినేవాడు దొడ్డవాడు
దోచుకొని దాచుకొని తినేవాడు మహా దొడ్డవాడు
రెండూ చేతకానివాడు
పనికిమాలినవాడు.

-పరుచూరి శ్రీనివాసరావు

వాటిలో నమ్మకం లేదు" అంటూ నేను వాళ్ల ఎదుట పలికిన బీరాలకు అర్థం లేదనిపించసాగింది.

అంతలో మా అందర్లోకీ చిన్నవాడైన సంతోష్ నా దగ్గరగా వచ్చి "కీపిట్ అప్ మాష్టారూ! మీ ధైర్యమే మీకు రక్ష. ఇలాంటి కథల్ని ప్రత్యక్ష అనుభవం ఉంటే గాని నమ్మకూడదు" అంటూ నాకు ధైర్యం చెప్పాడు. తన సీటుకి వెడుతూ "ఈ రాత్రి అనుభవాలేమిటో రేపు మాకు చెప్పండేం" అన్నాడు నవ్వుతూ.

ఆ రోజు చాలా మంచి రోజు కావడంతో, ఉదయమే నాకున్న కొద్దిపాటి సామానూ, ఆఫీస్ ప్యూన్ చేత ఆ ఇంటికి పంపించేశాను. నేనిటు ఆఫీసు నుంచి ఆ ఇంటికి వెళ్ళిపోవాలన్నది ఈ ఉదయం నేను వేసుకున్న ప్లాను. ఆ ప్లాను ప్రకారం వసతి గృహాన్ని ఖాళీ చెయ్యడం కూడా జరిగిపోయింది. ఈ రాత్రి పడుకోడానికి నేను ఆ ఇంటికి వెళ్లితీరాలి. సంతోష్ వచ్చి నాకు ధైర్యం చెప్పి వెళ్లాక నాకు శంకలు ఎక్కువయ్యాయి. "ఈ రాత్రి నాకు కాళరాత్రే కాబోలు దేవుడా" అని లోలోన బితుకుపడడం మొదలెట్టా.

అంతలో జి.ఎమ్.గారి నుండి పిలుపు వచ్చింది. ఆరోజు అర్జంట్ ఫైళ్లు కొన్ని డిస్పాచ్ చెయ్యాల్సి వుంది, దాని విషయం అయుంటుంది అనుకుంటూ నా ఆలోచనలన్నీ కట్టిపెట్టి లేచా.

నేను మా జనరల్ మేనేజర్ సూచనల ప్రకారం అర్జంట్ ఫైళ్లన్నీ క్లియర్ చేసి లేచేసరికి టైం సాయంకాలం ఆరయ్యింది. నాతోపాటు ప్యూన్ వీరాస్వామి కూడా ఉన్నాడు, నేను వెళ్లాక తలుపులన్నీ మూసి వాటికి తాళాలు వేసేపనిమీద. తక్కిన వాళ్లంతా ఎప్పుడో ఇళ్లకు వెళ్లిపోయారు.

వీరాస్వామి వర్కు ముగించి బద్ధకం తీరా ఒళ్లు విరుచుకుంటున్న నాకు దగ్గరగా వచ్చి "సారూ, ఆ ఇల్లు తమకి వద్దు. రేత్తిరి కాడ ఆడ దయ్యాలు డాన్సాడ తాయంట! తల్సుకుంటే ఒనుకు పుడతా ఉంది" అన్నాడు.

నాకూ లోలోపల వణుకుగానే ఉంది. కాని పైకి బింకంగా, "పోరా! ఈ రోజుల్లో ఇంకా అలాంటి కాకమ్మ కథలు నమ్మేవారు లేరు. ఎవరో స్వలాభం కోసం ఏవేవో కల్పించి ప్రచారం చేస్తారు" అన్నా.

వీరాస్వామి నన్ను వదలలేదు. "సారూ! నానేం అబద్ధాలు సెప్పటం లేదండయ్యా. నేను సామాను లోనెయ్యడానికి ఎల్లానా, ఓ సాయిబు అల్లంత దూరాన్నించి లగెత్తుకొచ్చి సెప్పిండు- ఓపాలి ఒకబ్బి దారే పోతా, గేటు తెరిసుంటే లోనకెళ్లి, ఆ రాత్రిరికి అరుగు మీద పైగుడ్డేసుకు తొంగున్నాడంట. తెల్లారి చూసేతలికి ఆడు ఆడనే నెత్తురు కక్కుకున్నాడంట. ఇంకా ఇలాంటి ఇసేసాలెన్నో సెప్పిండా సాయిబు. తమరా యింటేపు సూడొద్దు మా రాజా, నా మాట ఇనుకోండి" ముసలి వీరాస్వామి నా చేతులు పట్టుకుని బ్రతిమాలాడు.

ఆ మాటలు విన్నాక నాలో గుబులు పెరిగింది. కాని ఆ రాత్రి వేరే చోటు చూసుకోవాలంటే ఎలాగో ఉంది. సంతోష్ మాటలు గుర్తుతెచ్చుకున్నా. కాని ఎంతగా సరిపెట్టుకుందామని ప్రయత్నించినా నా మనసు మొరాయిస్తూనే ఉంది. ధైర్యం పుంజుకోవాలంటే ఏం చెయ్యాలి- అని ఆలోచించా. నా గుండె మోకాళ్లలోకి జారకముందే ఒక ఆలోచన వచ్చింది.

నేను ఇంతవరకు బసచేసిన వసతి గృహం సమీపంలో ఒక గుడి ఉందని గుర్తొచ్చింది. ఈ రోజు నేను తప్పకుండా ఆ గుడికి వెళ్లాలి అని నిశ్చయించుకున్నా. దైవబలం ఉంటే క్షుద్రశక్తులు ఏమీ చెయ్యలేవు- అనుకొన్నా. ఆఫీసు నుంచి నేరుగా గుడివైపుగా నడిచా.

ఆ గుడి ఓ మాదిరిగా పెద్దదే. ఎందరో హిందూ దేవతలకి ఆ ఆవరణలో చిన్న గుళ్లు కట్టబడి ఉన్నాయి. అన్ని గుళ్లనీ చుడుతూ మూడు ప్రదక్షిణలు చేశా. ఆ ఆవరణలో ప్రతిష్ఠించబడిన దేవుళ్ళందరికీ వరస తప్పకుండా దక్షిణలిచ్చి దణ్ణాలు పెట్టుకున్నా. శివుని గుడిలో గోత్ర నామాలు చెప్పి పూజ చేయించా. హారతి కళ్లకు అద్దుకున్నా. శటకోపం పెట్టించుకున్నా. ప్రసాదాలు తీసుకున్నా. గంటకొట్టి మరీ శివుని శరణు అడిగా. గుడిలో కొంచెం సేపు కూర్చుని లేచి బయటకు వస్తూ గుప్పెడు విభూది తీసి రుమాల్లో ఉంచి మూటకట్టి జేబులో పెట్టుకున్నా. అందరూ వింతగా చూసినా పట్టించుకోలేదు.

గుడి గుమ్మం పక్కన ఒక దేవుడి ఫొటోలు అమ్మే షాపు కనిపిస్తే, ఒక ఆంజనేయ స్వామి ఫొటో కొన్నా. పనిలో పనిగా బజారుకి వెళ్లి ఒక పెద్ద అగరువత్తుల కట్ట, ఒక టార్చిలైటు కూడా కొన్నా. అటునుంచి అటే హోటల్‌కి వెళ్లా. కడుపునిండా తింటే నిద్ర ముంచుకొస్తుందన్న భయంతో ఆ రాత్రికి కొద్దిగా టిఫిన్ చేసి ఊరుకున్నా. కాసేపు ధైర్యం పుంజుకోడానికి అటూ ఇటూ తిరిగా. ఆ తరువాత ఒక మంచినీళ్ల బాటిల్ కూడా కొనుక్కుని నెమ్మదిగా ఇంటికి నడిచా.

నేనా ఇంటికి చేరేసరికి ఎనిమిదిన్నర అయి ఉంటుంది. ఆ ఇంటి చుట్టూ నిలువెత్తు ప్రహరీ గోడ,

దానికో పెద్ద ఇనప గేటు ఉన్నాయి. ఆ గేటు తలుపులు మూసున్నాయి. లోపలకు నడిచి మళ్లీ గేటు మూశా.

ఇంటి దగ్గరకు టార్చి సాయంతో నడిచి సింహ ద్వారపు తలుపులు బార్లా తెరిచా. ఇంట్లో స్విచ్‌లన్నీ ఆన్ చేశా. ఇల్లంతా కాంతితో నిండింది. ఫానులు స్పీడ్‌గా తిరుగుతున్నాయి. నేను తెచ్చిన అగరొత్తుల కట్టలో సగం తీసి వెలిగించి గది గదికీ పొగ చూపించా. ఇల్లంతా సుగంధంతో నిండింది.

రాత్రికి నిద్రపోకూడదని గట్టిగా నిర్ణయించుకుని ఉన్నానేమో పక్క పరుచుకోడానికి నేనేం తొందరపడ లేదు. నట్టింట నిలబడి చేతులు జోడించుకుని హను మాన్ చాలీసా చదవడం ప్రారంభించా. భక్తీ భయమూ జంట కవుల్లా కలిసి ఉంటాయి కాబోలు! నాలో భయం పెరుగుతున్న కొద్దీ భక్తి కూడా పెరగడం చూస్తుంటే నాకే ఆశ్చర్యంగా తోచింది. పనిలోపనిగా, రేపు ఉదయం ఏ ఆపదా లేకుండా కళ్ల చూడడం అన్నది జరిగితే, కలియుగంలో ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి కొండెక్కి వస్తాననీ, ఆ మొక్కు తీర్చు కునే వరకు ప్రతి శనివారం ఏక భుక్తాలు ఉంటాననీ మనసా మొక్కుకున్నా. ఆ తరువాత శివుని గుడి నుంచి తెచ్చిన విభూది ఇల్లంతా చల్లి బెడ్‌రూంలో నా పక్క పరచి ఆ పక్క చుట్టూ కూడా చల్లా. ఇల్లంతా సింధూరం బొట్లు అక్కడక్కడా పెట్టా. గదిలో ఈశాన్య మూలగా కొంచెం మేర శుభ్రం చేసి ఒక పేపర్ పరచి ఆంజనేయ స్వామి ఫొటో దానిమీద ఉంచి నేను తెచ్చిన పూజా ద్రవ్యాలతో పూజచేసి, అగరువత్తులు వెలిగించి అరటి పండుకి గుచ్చిపెట్టా. బెడ్‌రూం కిటికీలకు సింధూరం బొట్లు పెట్టి "ఆంజనేయస్వామి ఆన" అని వాటికి చెప్పి "ఎవరు చెప్పినా తెరుచుకోవద్దంటూ" బోల్టులు గట్టిగా బిగించా.

ఎట్టి పరిస్థితిలోనూ ఆ రోజు నాకు నిద్ర వచ్చే ఛాయలేం కనిపించటంలేదు. కన్నుల్లో ఒత్తులేసుకుని దేనికోసమో ఎదురు చూస్తున్నట్లుంది నా పరిస్థితి! అన్ని తలుపులూ సరిగా బిగించి, ఒక్క పడక గదిలో తప్ప, తక్కిన గదులన్నింటిలో లైట్లు తీసేశా. పక్క మీద చేరి నిన్న మొదలుపెట్టిన నవల, రాబర్టు లడ్‌లాం వ్రాసిన "ది హేడ్సు ఫాక్టర్" చేతిలోకి తీసుకున్నా ఈ రోజు చదివి పూర్తిచేసే ఉద్దేశంతో.

టైం చూశా! పది దాటింది. చేతి గడియారం తీసి దిండు ప్రక్కన ఉంచా. కాసిని మంచినీళ్లు తాగి చదవడం మొదలుపెట్టా. కాసేపట్లో కథలో లీనమై పరిసరాలన్నీ మర్చిపోయా. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

ఏదో చప్పుడు నా ఏకాగ్రతను భంగం చేసింది. వాచీ చేతిలోకి తీసుకు చూశా! రెండుం పావు అయింది. ఎక్కడో దూరంగా కుక్కలు మొరలెత్తి "ఓం" అంటూ మొరుగుతున్నాయి. గుడ్లగూబ వేటలో ఉంది కాబోలు కర్ణకఠోరంగా కూసింది. బయట ఎండు టాకుల గలగలలు!

అంతలో అవి మువ్వల సవ్వడులుగా మారాయి. ఒల్లు ఝల్లుమంది నాకు. అల్లంత దూరంలో ఎవరో మృదువుగా అడుగులు వేస్తూ ఇటువైపుగా వయ్యారా లొలకబోస్తూ నడిచి వస్తున్నట్లనిపించింది. నాలో భయం.. భయంతో వణుకు మొదలయ్యాయి. ధైర్యం చెప్పుకోవాలని ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. 'హనుమాన్ చాలీసా' చదువుకోవాలను కున్నా. కాని ఒక్క 'దోహా' కూడా గుర్తురాలేదు. మువ్వల మోత క్షణక్షణానికీ దగ్గరవుతోంది.

బెడ్‌రూం కిటికీల వరకు వచ్చిన మువ్వల మోత కొంచెంసేపు అక్కడ ఆగినట్లనిపించింది. అంతలోనే మళ్లీ జోరు పెరిగింది. వివిధ భంగిమల్లో నృత్యరీతులు ప్రదర్శిస్తూ, ఎగురుతూ, దూకుతూ వివిధ లయలతో నృత్యం చేస్తున్నట్టుగా తోచింది. చిరు గజ్జల సవ్వడిగా మొదలైన ఆ నృత్యం క్రమంగా వేగాన్ని పుంజుకుని విలయ తాండవంగా మారింది. ఒకటే మువ్వల మోత!

నాకు ఆపాదమస్తకం చెమట ధారలు కట్టింది. శ్రేయోభిలాషుల మాట విననందుకు నన్ను నేను మనసులోనే తిట్టుకున్నా. క్రమంగా నాలో భయం పెరిగి పెరిగి వివశత్వం వచ్చేసింది. ఇక నా ఒళ్లు నాకు తెలియలేదు. ఆపైన ఏం జరిగిందో నాకు తెలియదు.

మళ్లీ నాకు స్పృహ వచ్చి, కళ్లు తెరిచి చూసేసరికి కిటికీ సందుల్లోంచి వెలుగు లోపలికి చొచ్చుకొస్తోంది. బయట చెట్లమీద ఆడే పిట్టల కువకువలు తప్ప మరే సందడీ లేదు. లేచి కూర్చుని ఒళ్లంతా తడిమి చూసు కున్నా. ఏ గాయాలూ, మరే గుర్తులూ లేవు. 'అమ్మయ్య' అనుకున్నా. "విభూది మహిమ వల్ల దెయ్యాలు లోపలకు రాలేకపోయాయన్నమాట."

తెల్లగా తెల్లవారిపోయింది. కనుక, ఇంక దయ్యాల భయం లేదు అనుకుంటూ కిటికీ తలుపు తెరిచా. చల్లని గాలి లోపలకు వీచింది. దొడ్లో మార్పేం కనిపించలేదు కాని, నాకేదో వెలితిగా వున్నట్టు అని

పించింది. మరింత పరిశీలనగా చూడడం కోసం తలుపు తెరుచుకుని బయటకు వచ్చి పడక గది ఉన్నవూపుగా నడిచా.

దొడ్డిలో ఉన్న పిచ్చిమొక్కలకి రంగు రంగుల పూలు విరిసి అందాన్ని తెచ్చాయి. ఆ పూలమీద వాలి రకరాల కీటకాలు తేనెను పీల్చుకుంటూ ఆనందిస్తున్నాయి. పూవు పూవుకూ వాలి తేనె తాగుతూ ఎగురుతున్న సీతాకోక చిలుకలతో దొడ్డంతా సందడిగా ఉంది. పడక గది కిటికీల దగ్గరికి వెళ్లి చూశా.

అక్కడ మొలచిన గడ్డి, ఎవరో చితక తొక్కినట్లుగా వాలిపోయి ఉంది. దయ్యాల నృత్యం సాగింది అక్కడే కదా- అనుకున్నాను. అటూ ఇటూ పరికించి చూస్తే తెలిసింది. అక్కడ నాకు వెలితిగా ఎందుకు కనిపించిందో! చలపతితో వచ్చి చూసినప్పుడు ఆ కిటికీలకి ఎదురుగా నాకొక లేగడ మొక్కనిండా ఆకులు, చిగుర్లతో నిండుగా కనిపించింది. ఇప్పుడా మొక్క ఆకులన్నీ ఎవరో దూసేసినట్లు బోసిగా ఉంది. అలా ఎందుకుందో నాకు అర్థమవ్వలేదు. ఆ ఆకులతో లంబాడీ దయ్యాలు ఏం చేసుకుంటాయా- అని ఆశ్చర్యంగా అనుకున్నా. అంతలో పదిగజాల దూరాన గడ్డిలో ఏదో చిన్న కదలిక కనిపించడంతో తలెత్తి చూశా.

చెట్ల చాటున గడ్డిలో రెండు మూటలు లాంటివి కనిపించాయి. అందులో ఒకటి నల్లగా, మరొకటి తెల్లగా ఉన్నాయి. ఏమిటి! ఈ ఇంటిని పగలు కూడా విడిచిపోవా దయ్యాలు- అనుకొని విస్తుపోయా. అంతలో అవి కొద్దిగా కదిలినట్లు అనిపించింది. అవి నన్ను చూసే లేచి వస్తున్నాయి కాబోలు అనిపించి, “అయ్య బాబోయ్!” అంటూ పెద్దగా అరిచి కుప్పకూలిపోయా.

ఆ గడబిడకు భయపడ్డాయి కాబోలు, రెండు మేకలు లేచి నిలబడి “మేం” “మే” అని అరుస్తూ వీధి గేటువైపు పరుగు పెట్టాయి. వాటి మెడల్లో కట్టి ఉన్న చిరుమువ్వలు సందడి చేశాయి. నాకు అంతా అర్థమైపోయింది. ఘల్లుఘల్లు మంటున్న ఆ మువ్వల ధ్వని నన్ను వెక్కిరించింది. నేను కంగారుగా లేచి మేకల వెనుక పరుగెత్తాను.

నేను గేటుని సమీపించే సరికి మా పొరుగునున్న సాయిబు గేటు తెరిచి మేకల్ని బయటికి పంపి, మళ్లీ గేటు మూస్తున్నాడు. నేను గమ్మున వెళ్లి చెయ్యి గట్టిగా పట్టుకుని “ఇలా ఎందుకు చేశావు” అంటూ నిలదీశా.

సాయిబు బిత్తరపోయాడు. గుట్టు రట్టయిందని

# తడబడుతున్న నిజం

బాల్యపు బొమ్మరింట
పొదువుకున్న అలవాట్లు
యవ్వన కలల సౌధానికి
రెడీమేడ్ మందుపాతరలౌతాయి
కోరికల గుర్రం మీద
ప్రపంచ సంచారం చేస్తూ
అమాంతం ‘అనుభవించే’య్యాలనే ఉబలాటం
అనుక్షణపు ఆరాటమై
తుచ్ఛమైన లక్ష్యంతో
మనిషి పరకాయ ప్రవేశం చేస్తాడు.
అందుబాటులోని
వేయిపడగల విషనాగుల నీడలో
రెండు నాల్కల వాడౌతాడు.
చెప్పేది అసత్యం. / చేసేది అనిత్యం
అవిటిదనపు గమ్యం వైపు
జీవన గమనం సాగుతుంటుంది.
చర్మం నెరజల్లోంచి
యవ్వనం జారిపోతూ
అనుభవిస్తున్న క్షణాలు
నక్షత్ర కాంతులౌతాయి
నిజం గ్రహించేలోగా
రూపం తెలియని రోగాల భౌతిక కాయానికి
భేతాళ రూపం జోడవుతుంది.
ఆక్రందనలు; ఆర్తనాదాలు
మనసు చెవులలో / సంగీతాలాపన చేస్తూ...
చేసిన పాపాల కుప్పలు / శాపాల కడలి క్రింద
చెరిగిపోని గుర్తులుగా మిగులుతూ...
అంకితం చేద్దామన్నా
స్వీకర్తలేని అముద్రిత గ్రంథమౌతుంది / జీవితం.
మనసును సమాధానపరచిన
పూల భాగాల ప్రశ్నలు
శరీర గాయాన్ని కాకుల్లా పొడుస్తూ
అంపశయ్య భీష్ముణ్ని చేస్తాయి
దేహముక్తి ప్రసాదించే
మరణపు జేగంట కోసం
మనిషి చూపు నిరీక్షిస్తూ
కాలం ముళ్ళతో తిరుగుతూ.. తిరుగుతూ...
తడబడుతున్న నిజంలా...

-కొత్తపల్లి ఉదయబాబు

గ్రహించి కాళ్లబేరానికి వచ్చేశాడు. "మాఫ్ కర్ దో సాబ్! హమ్‌కో మాఫ్ కర్‌దో సాబ్! ఇస్ ఘర్‌మే ఏక్ లంబాడీ లడకీ మర్‌గయా థీ, మే ఝూట్ నహీ సాబ్! పాయల్ కా ఆవాజ్ మేరీ బకరీకీ పాయల్ హై! ఆప్‌కీ పామ్ పడ్‌తా హుం మహరాజ్! హమే మాఫ్ కర్ దో సాబ్! మై హూం గరీబీ ఆద్మీ సాబ్!"

నా కాళ్లమీద పడి గోలగోలగా అడుగుతున్నాడు సాయిబు క్షమించమని. నా మనసు తీవ్రంగా స్పందించింది. వెంటనే ఒక ప్లాను స్ఫురించింది.

"సరేనయ్యా సాయిబూ! లే, ఇంక. కాని ఈ విషయం ఎక్కడా అనమోక; నీకే నష్టం. అందరికీ తెలిస్తే ఇదొక పెద్ద పోలీస్ కేసు అవుతుంది. జాగ్రత్త సుమీ! ఎక్కడా నోరు జారకు. అంతా మర్చిపో. ఇక నువ్వు వెళ్లొచ్చు" అన్నా.

"సలాం సాబ్" అంటూ సాయిబు బ్రతుకుజీవుడా అని దౌడుతీశాడు.

❍ ❍ ❍

ఆ మరునాడు నేను దర్జాగా స్నానం చేసి ఠీవిగా నడుచుకుంటూ ఆఫీసుకు వెళ్లా. చెక్కు చెదరకుండా ఉన్న నన్ను చూసి అంతా ఆశ్చర్యపోయారు. రాత్రి జరిగిన విశేషాలను వినడానికి నా చుట్టూ చేరారు నా కొలీగ్స్.

అందరూ చెవులొరజేసి ఆత్రంగా వింటూండగా, అంతకి ముందరే నేను ఊహించి ఉంచుకున్న కథను వాళ్లకి చెప్పడం మొదలుపెట్టా–

"నా భార్య పినతండ్రి గొప్ప ఆంజనేయోపాసకుడు. ఆయన ఆ కుటుంబంలో పుట్టినవాళ్లకి, వాళ్ల కుటుంబంతో సహా అందరికీ ఆంజనేయస్వామి రక్షణ ఉండేలా ఒక 'రక్షా కవచాన్ని' ఏర్పాటుచేసి పోయారు. ఆ ధైర్యంతోనే నేను నిన్న వెళ్లి ఆ ఇంట్లో పడుకున్నాను."

"రాత్రంతా మీరు బాగానే నిద్రపోయారన్నమాట! నేను మాత్రం మిమ్మల్నే తల్చుకుంటూ, నిద్రపోలేక నానా బాధ పడ్డాను. ఈ రక్షాకవచం ఉన్న సంగతి మీరు ముందే మాతో ఎందుకు చెప్పలేదు" అంటూ నిష్టూరం వేస్తూ పెద్దగా ఆవులించాడు సంతోష్.

అంతలో చలపతి ఆఫీసుకి వచ్చాడు. నిన్న జ్వరం వచ్చిన మాట నిజమే కాబోలు మొహం పీక్కుపోయి నీరసంగా కనిపించారు. అందరూ అతని మీద విరుచుకుపడ్డారు "సాటి వాణ్ణి మోసం చేశాడు" అంటూ.

చలపతి విసుక్కున్నాడు. "మీరంతా నా మీద పడతారేమిటి! అతనికి ఏమీ కాలేదు కదా" అన్నాడు, ఒక పక్క మనసులో ఆశ్చర్యపోతూనే.

అతనికి "ఆంజనేయ కవచం" విషయం పోటీపడి చెప్పారు అందరూ.

"అయితే చంద్రం! ఆ ఇల్లు నువ్వే కొనేసుకో కూడదూ! ఏటా రెండుసార్లు ఆ ఇంటిని శుభ్రం చేయించే పనైనా తప్పుతుంది నాకు" అన్నాడు చలపతి.

అదే నేను ఆశించిన బోనస్! కాని, పైకి బింకంగా "అంత ఇల్లు కొనే డబ్బు నాకెక్కడిదీ!" అన్నా.

"ఆ ఇల్లేం పెద్ద రేటు లేదు. ఆరు లక్షలిచ్చి, రిజిస్ట్రేషన్ ఫీ కట్టుకుంటే సరిపోతుంది. ఈ దయ్యాల పీడతో నిక్షేపం లాంటి కొంప విలువలేనిది అయిపోయింది" అన్నాడు చలపతి బాధగా.

"అదేమిటి? మొన్నదాకా ఐదు లక్షలే అన్నావు కదా?"

సంతోష్ మాటలకి నొచ్చుకున్నాడు చలపతి. "కాస్త రీజనబుల్‌గా మాట్లాడు సంతోష్! ఊళ్లో రేట్లు ఎలా పెరుగుతున్నాయో తెలియదా? నేను మా బావలకు సరైన జవాబు చెప్పగలిగి ఉండాలి కదా?"

అదీ నిజమేననిపించింది నాకు. ఏదో ఈ దయ్యాల భయం చేత ఆ ఇల్లు ఆరు లక్షలకు వస్తోంది గాని లేకపోతే అది రెట్టింపైనా చేస్తుంది. ఆ దొడ్డే చాలు! అత్యాశకు పోతే ఉన్నది కాస్తా చెయ్యి జారిపోగలదు" అన్న ఆలోచన వచ్చింది నాకు. ఇంక శషభిషలేమీ చెప్పకుండా వెంటనే ఒప్పేసుకున్నా.

"సరే, ఈ రోజు రాత్రే నేను మా బావతో చెబుతా. డబ్బు సిద్ధం చేసుకోండి" అంటూ తన సీటు దగ్గరకి వెళ్లిపోయాడు చలపతి.

నేనూ ఆ వేళే రాత్రిపూట మా ఆవిడతో డబ్బు విషయం సంప్రదించాలని నిశ్చయించుకున్నా. ఒకవేళ మేము కూడబెట్టిన మొత్తం చాలకపోతే పిలిచి మరీ లోన్లు ఇచ్చే బ్యాంకులు ఉన్నాయి కదా! ఆ ఇంటినే కుదవబెట్టి కావలసిన మొత్తం లోనుగా తీసుకుని ఆ తరవాత తీర్చెయ్యొచ్చు ఫరవాలేదు అనుకున్నా.

వారం తిరిగేసరికి ఆ ఇల్లు మా ఆవిడ పేర "రిజిష్టర్" అయింది. నేను గుడి ముందు కొన్న ఆంజనేయుల వారి పటం మా ఇంటి ద్వారబంధంపైన చిన్న మేకు కొట్టి దానికి తగిలించా. శ్రీ ఆంజనేయుల వారి 'రక్షా కవచం' అంటూ.

కాని ఆ ఇంటికి ఇప్పటికీ 'దెయ్యాల కొంప' అన్న పేరు మాత్రం అలాగే ఉండిపోయింది, నాకు నా పాపాన్ని గుర్తుచేస్తూ! ■